హాట్ సీట్.. లక్కీ చాన్స్

- మల్లారెడ్డికి మంత్రి చాన్స్ మల్కాజిగిరి చలువే
- రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్ష పదవి.. సీఎం అదృష్టం ఇక్కడి స్థాన బలమే..
- ఇక్కడ ఓడిపోయినా.. రాజకీయ ప్రాబల్యం తగ్గదని చర్చ

మల్కాజిగిరి లోక్‌సభ నుంచి బరిలో నిలిస్తే రాజకీయ భవిష్యత్తే..



సాక్షి, మేడ్చల్ జిల్లా: దేశంలో అతిపెద్ద నియోజకవర్గంగా పేరొందిన మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం పలువురు రాజకీయ నాయకులకు పునర్జన్మ ఇచ్చిందనడంలో అతిశయోక్తి లేదు. మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలుపొందిన నాయకులకు తమ రాజకీయ ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడిందన్న చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా ఉంది. ఇక్కడి నుంచి పోటీ చేసి విజయం సాధించిన నేతలకు తమ పార్టీలో అత్యున్నత పదవులు దక్కమే కాకుండా.. పాలనాపరంగా ముఖ్యమంత్రిగా, కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా పనిచేసే అదృష్టాన్ని పొందారన్న నానుడి ఉంది.

- ఈ నియోజకవర్గం నుంచి పోటి చేసి ఓడిపోయిన నేతలకు కూడా రాజకీయ రంగంలో అదృష్టం కలిసొచ్చిందన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఏది ఏమైనా, రాజకీయ పునరావాసానికి, భవిష్యత్‌కు మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం సెంట్‌మెంట్‌గా కలిసొస్తుందని పలువురు నాయకులు భావిస్తుండటంతో.. ప్రస్తుత ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్‌సభ స్థానం హాట్ సీటు.. లక్కీ చాన్స్‌గా మారిందనడంలో సందేహం లేదన్న అభిప్రాయాలు రాజకీయ వర్గాల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం 2024 ఎన్నికల్లో ఇక్కడి నుంచి పార్టీల అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ఈటల రాజేందర్(బీజేపీ), పట్నం సునీత మహేందర్‌రెడ్డి(కాంగ్రెస్), రాగిడి లక్ష్మారెడ్డి (బీఆర్ఎస్)లకు కూడా మల్కాజిగిరి సెంట్‌మెంట్ ఏ విధంగా కలిసి వస్తుందో వేచిచూడాల్సిందే అంటున్నారు.
- 2009లో మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సర్వే సత్యనారాయణ పోటీ చేసి గెలుపొందడం వల్లే.. కేంద్రమంత్రి వర్గంలో స్థానం దక్కిందన్న చర్చ రాజకీయ వర్గాల్లో ఉంది. అలాగే, ఇదే లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శాసన సభ్యుడుగా గెలిచిన సర్వే సత్యనారాయణకు రాజకీయంగా అదృష్టం కలిసి వచ్చిందన్న అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో ఉన్నాయి.
- 2014లో మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్‌లో టీడీపీ నుంచి ఎంపీగా గెలుపొందిన చామకూర మల్లారెడ్డికి పదవి కాలం పూర్తవకముందే.. మేడ్చల్ అసెంబ్లీ స్థానం నుంచి శాసన సభకు పోటీ చేసి గెలుపొంది. రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం సంపాదించుకున్నారు. ఇది కూడా మల్లారెడ్డికి కలిసొచ్చిన మల్కాజిగిరి సెంటిమెంటేనని పేర్కొంటున్నారు.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటి చేసి ఓడిపోయిన రేవంత్‌రెడ్డికి మల్కాజిగిరి సెంట్‌మెంట్ బాగా కలిసొస్తుందన్న అభి ప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా ఉంది. 2019లో అనూహ్యంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటి చేసి, విజయం సాధించిన రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్ష పదవిని కాంగ్రెస్ అధిష్ఠానం కట్టబెట్టింది. దీంతో ఆయన రాజకీయ జీవితం మలుపు తిరిగింది. అనంతరం 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ కొడంగల్ నుంచి పోటీ చేసి విజయం సాధించిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. రాష్ట్ర మంత్రి వర్గంలో సభ్యుడిగా పని చేయకుండానే రేవంత్‌రెడ్డి ఏకంగా సీఎం కావడం మల్కాజిగిరి సెంట్‌మెంట్ అనే చర్చ రాజకీయ వర్గాల్లో ప్రచారమవుతోంది.

ఓటమి చెందినా..

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి 2019లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి శాసనసభ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఈ విజయం కూడా రాజశేఖర్‌రెడ్డికి మల్కాజిగిరి సెంటిమెంటేనన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లోనూ..

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన నేతలు గెలిచినా.. ఓడినా తమ రాజకీయ ఎదుగుదల, భవిష్యత్‌కు ఈ స్థానం సెంటిమెంట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్న చర్చ రాజకీయ వర్గాల్లో ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పోటీలో నిలుస్తున్న నేతలకు మల్కాజిగిరి సెంటిమెంట్ ఏవిధంగా తమ రాజకీయ భవిష్యత్‌కు ఉపయోగపడుతుందో.. వేచి చూడాల్సిందే.

- అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్, గజ్వేల్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి ఈటల రాజేందర్ మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అలాగే, జెడ్పీ చైర్‌పర్సన్‌గా మూడు పర్యాయాలు పనిచేసిన పట్నం సునీత మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలవగా, బీఆర్ఎస్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి తన రాజకీయ భవిష్యత్తును పరీక్షించుకుంటున్నారు.

మళ్లీ బీజేపీలోకి ఎనుగుల తిరుపతి



మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో పార్టీలో చేరిన ఎనుగుల తిరుపతి

ఓల్డ్‌బోయిన్‌పల్లి: బీఆర్ఎస్ పార్టీలో చేరి ఆరు నెలలు కాకముందే ఎనుగుల తిరుపతి మళ్లీ బీజేపీలో చేరి అందరిని ఆశ్చర్యపరిచారు. గురువారం రాత్రి కానాజీగూడలోని ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మళ్లీ బీజేపీ కండువా కప్పుకున్నారు. గతంలో ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం మేడ్చల్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా ఉన్న తిరుపతి అనివార్యకారణాలతో పార్టీ మారిన విషయం తెలిసిందే.

బీఆర్ఎస్‌లో గౌరవం దక్కడం లేదని..

రాష్ట్రంలో గత నాలుగు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు గతేడాది అక్టోబర్‌లో స్వయంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తిరుపతి ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించారు. ఆ తర్వాత ఆయన మాజీ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం పార్టీలోకి తనకు తగిన గౌరవం దక్కడం లేదని మళ్లీ బీజేపీలోకి రావాలని నిర్ణయించుకున్నారు.

ఈటల రాజేందర్ సమక్షంలో చేరిక..

మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో గురువారం రాత్రి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. ప్రపంచాల దేశాలకు భారత్ గొప్పతనాన్ని చాటి చెబుతున్న నరేంద్రమోదీని చూసి బీజేపీలోకి వచ్చానన్నారు. మల్కాజ్‌గిరి అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఈటల రాజేందర్ 3లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, శ్రీకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు నమోదు చేయాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసిన నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు, అభ్యర్థుల ఖర్చుల వివరాలను నమోదు చేయాలని జిల్లా వ్యయ పరిశీలకుడు మనోజ్ అలోయిస్ లక్రా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మరో వ్యయ పరిశీలకుడు ధృవ్ భోశాలుతో కలసి ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్సు, వీడియో సర్వేలెన్సు, వీడియో వ్యూయింగ్, అకౌంటింగ్, షాడో టీమ్‌లతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అన్ని టీమ్‌లు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని సూచించారు. అనుమానాస్పద ఖాతాలను చెక్ చేయాలని ఇన్‌కమ్ టాక్స్, బ్యాంకు అధికారులను ఆదేశించారు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించిన పార్టీ ప్రచార ఖర్చులు నిర్ణయించిన రేట్ల ప్రకారం నమోదు చేయాలన్నారు. కరపత్రాలు పోస్టర్లు, ఫ్లెక్సీలు ముద్రించినట్లు, ప్రింటర్ అండ్ ప్రచురణకర్తలు ఎన్నికల ప్రాతినిధ్యం చట్టం 127ఏ ప్రకారం నిబంధలను పాటించాలన్నారు.

ఎన్నికల వ్యయం నమోదు చేయాలి

ఎంసీఎంసీ ద్వారా ఎన్నికల్లో ప్రకటనలు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సర్టిఫికేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయం నమోదు చేయాలన్నారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా రోజువారీ దినపత్రికలలో వచ్చే పెయిడ్ న్యూస్‌పై దృష్టి సారించాలన్నారు. సోషల్ మీడియాపై పటిష్ట నిఘా ఉండాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేలా డబ్బులు, మద్యం పంపిణీపై ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్ఎస్‌టీ తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. లావాదేవీలపై పర్యవేక్షణ చేయాలన్నారు.

తనిఖీలు ముమ్మరం

అన్ని టీంలు జిల్లాలో చెక్ పోస్టుల ద్వారా నిఘా ఏర్పాటు చేశామని, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుతో తనిఖీలు ముమ్మరం చేశామని పేర్కొన్నారు. సీ- విజిల్ యాప్, టోల్ ఫ్రీ నంబర్ 1950 కాల్ సెంటర్, గ్రీవెన్స్ కమిటీ సెంటర్, ఎంసీఎంసీ, మీడియా సెంటర్లను జిల్లా వ్యయ పరిశీలకులు తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంసీసీ నోడల్ అధికారి కృష్ణారెడ్డి, ఎక్స్‌పెండిచార్ మానిటరింగ్ నోడల్ అధికారి రాజేందర్‌రెడ్డి, నోడల్ అధికారులు, ఇతర టీం సభ్యులు పాల్గొన్నారు.

కమిటీ రద్దు చేయాలి

- విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ, స్టూడెంట్స్ యూనియన్, ఇతర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన

రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌లో చోటు చేసుకున్న ఘటనలపై వేసిన కమిటీ తక్షణం రద్దు చేయాలని హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లోని పరిపాలనా భవనం ఎదుట స్టూడెంట్స్ యూనియన్, ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాంపస్‌లో జరిగిన ఘటనలపై విచారణ చేపట్టేందుకు కమిటీని వేయడం స్వాగతిస్తామని, కానీ ఒక వర్గానికి మద్దతు ఇచ్చే వారికి ఇందులో చోటు కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ప్రస్తుత కమిటీని రద్దు చేసి వెంటనే న్యాయబద్ధంగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవడంపై సిఫార్సు చేసే వారికి కమిటీలో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

నేడు రెండు చిత్రప్రదర్శనలు ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్ గ్యాలరీలో నేటి నుంచి రెండు చిత్రప్రదర్శనలను నిర్వహించనున్నారు. చిత్రకళాకారుడు వి.లక్ష్మణ్ వేసిన చిత్రాలను 'నేచర్ విత్ హ్యూమన్ ఫేస్' పేరిట ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రదర్శన రెండు రోజుల పాటు కొనసాగనుంది. 41 మంది అంగవైకల్యం కలిగిన చిత్రకళాకారులు వేసిన చిత్రాలను మూడు రోజుల పాటు ప్రదర్శించనున్నారు. ఈ ప్రదర్శనలను ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అలరించిన సంగీత కచేరి

మాదాపూర్: కళాకారులు సంగీత విభావరి కార్యక్రమంతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో శుక్రవారం శ్రీవాగ్దేవి సంగీత శిక్షణాలయం శిష్యబృందం సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్వేత, శరణ్య, భార్గవి, అపర్ణ, తదితరులు సంకీర్తనలను ఆలపించి అలరించారు. ఇందులో సీతమ్మ మాయమ్మ, ప్రణమామ్యహం, జగదానందకారక, బ్రోవభారమ, అన్నపూర్ణే, సుమనస, ఆదిలక్ష్మి, శ్రీమన్నారాయణ, ఇదిగో భద్రాద్రి, పాహిరమాప్రభో తదితర కీర్తనలను ఆలపించారు. వయోలిన్ పవన్‌సింగ్, మృదంగం శ్రీకాంత్, ఘటం వెంకటేష్ తదితరులు సంగీత సహకారాన్ని అందించారు.

'ఈటల రాజేందర్‌కు లక్ష ఓట్ల మెజార్టీ వస్తుంది'



పర్వత్‌నగర్ జనప్రియనగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న పులిగొళ్ల శ్రీలక్ష్మీయాదవ్

మోతీనగర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఈసారి లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తారని పులిగొళ్ల శ్రీలక్ష్మీయాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ కాలనీ జనప్రియనగర్ నుంచి రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మే 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఈసారి బీజేపీకే పట్టం కడతామని ప్రజలు చెబుతున్నారన్నారు. మోదీ పాలనతో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. మరల అభివృద్ధి కొనసాగాలంటే బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అల్లాపూర్ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షులు రేఖ, వాసవీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు పుట్టినరోజు



బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మిత్రులు, కార్యకర్తలు, నాయకులు



వడ్డేపల్లి రాజేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు జన్మదినం సందర్భంగా టీం వీఆర్ఆర్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఏర్పాటు చేసిన వేడుకల్లో వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిమానులు వడ్డేపల్లి రాజేశ్వరరావును గజమాలతో సత్కరించారు. అనంతరం టీం వీఆర్ఆర్ సభ్యులు భారీ కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి తన జన్మదిన వేడుకలకు విచ్చే సిశుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి, నాయకులకు, కార్యకర్తల అభిమానానికి ఋణపడి ఉంటానని అన్నారు. ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున అభిమానులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్కాజిగిరి అభివృద్ధికి నిరంతరం కృషి

నామినేషన్ వేసిన స్వతంత్ర ఎంపీ అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్



నాగోలు: అన్ని వర్గాల ప్రజలకు మరింత సేవ చేసేందుకు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు పెండ్యాల శేష సాయి వరప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) తెలిపారు. శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం స్వతంత్ర ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు కొత్తపేటలో మారుతినగర్‌లోని భాగ్యనగర్ బ్రాహ్మణ సమాజ భవనం నుంచి ర్యాలీగా బయలుదేరి మోహన్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట, న్యూనాగోలు, సమతాపురి కాలనీ నుంచి ర్యాలీగా వెళ్లి మల్కాజిగిరి రిటర్నింగ్ కేంద్రంలో నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వైష్ణవీ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజల మనిషిగా, ప్రజల మధ్యలో ఉండి ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేయడానికి ముందుకు వస్తున్నానని తెలిపారు. పేద ప్రజలకు మేలు చేసే లక్ష్యంతో మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి మీ అందరి మద్దతుతో ఎంపీ పదవికి పోటీ చేస్తున్నానని తెలిపారు. తనను ఎంపీ గెలిపిస్తే మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని తెలిపారు. ఈ సందర్భంగా వైష్ణవీ ప్రసాద్ నగరంలోని పలు బ్రాహ్మణ సంఘాల నాయకులు, ఇతర కాలనీ వాసులు పెద్ద ఎత్తున సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల నాయకులు దడ్డు సుబ్రహ్మణ్యం, జంటనగరాల బ్రాహ్మణ సంఘాల సమాఖ్య పూర్వ అధ్యక్షుడు వారణాసి వంశీ, వక్కలంక శ్రీనివాస్‌రావు, గొల్లపూడి రాజేశ్వరరావు, ప్రబల విశ్వనాథం, కై లాస్, కర్ర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు పశువుల సంత

మోతీనగర్: మూసాపేట డివిజన్ బబ్బుడగూడలో ప్రతి శని, ఆదివారాలలో రెండు రోజుల పాటు రంగారెడ్డి జిల్లా నార్సింగ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువుల సంత కొనసాగుతుంది. ఈ సంతకు రాష్ట్రం, జిల్లాల నుంచి పలువురు రైతులు వచ్చి పశువుల అమ్మకాలు, కొనుగోలు చేపడతారు.

కూరగాయల ధరలు



కూకట్‌పల్లి: రైతుబజార్‌లో కూరగాయల ధరలు శుక్రవారం కిలో రూపాయల్లో... టమాట 15, వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జిమిర్చి 35, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజి 23, బీన్స్ 55, క్యారెట్ 33, గోబిపువ్వు 20, దొండకాయ 28, చిక్కుడుకాయ 45, గోరు చిక్కుడు 28, బీట్‌రూట్ 21, క్యాప్సికం 55, ఆలుగడ్డ 33, కీరా 25, దోసకాయ 15, సొరకాయ 11, పొట్లకాయ 18, కంద 65, ఉల్లిపొరక 40, ఉల్లిగడ్డ 19, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 8 నుంచి 9, చామగడ్డ 35, ముల్లంగి 4 నుంచి 5, చిలగడ దుంప 21, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు 55 నుంచి 60, మునగ కాయలు 4 నుంచి 5, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 200, అల్లం 180, వెల్లుల్లి 240, చింతపండు 120, పండుమిర్చి 80, ఉసిరి 40, వేరుశెనగ నూనె 165, పామాయిల్ నూనె 97లుగా ఉన్నాయి.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ కొత్తూరు సీతయ్య నగర్‌లో జరిగిన పలుదేవతా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, ఆర్.శివ, బి.నరేందర్, కె.బాలరాజ్, భానుపు చందర్, కుమారస్వామి, పి.సురేష్, కిషోర్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ డివిజన్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జగదీశ్వర్‌గౌడ్, దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి నరేందర్‌రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ భానుప్రసాద్, ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, ఇన్‌చార్జి నల్ల సంజీవరెడ్డి, కృష్ణ ముదిరాజ్, సత్యంగౌడ్, శశిధర్, నవీన్‌రెడ్డి, శ్రీదేవి, రెహమాన్, శిరీష, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు మూడు నామినేషన్లు

చేవెళ్ల ఎంపీ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు

రాజేంద్రనగర్: పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండో రోజు శుక్రవారం చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గానికి ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. బీఎల్ఎఫ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఎంసీపీఐ(యూ) పార్టీ అభ్యర్థిగా వనం సుధాకర్, ఇండియన్ నేషనల్ లీగ్ పార్టీ అభ్యర్థిగా మహ్మద్ చాంద్ పాషా, బీఆర్ఎస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ తరపున ప్రతిపాదకులు మేకల భిక్షపతి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శశాంకకు అందజేశారు. తొలిరోజు మూడు నామినేషన్లు దాఖలు కాగా... రెండోరోజు మరో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో నియోజకవర్గానికి మొత్తం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి శశాంక ప్రకటించారు.

ఎన్నికలైన వెంటనే ఆరు గ్యారంటీలు

- మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి



కాంగ్రెస్ బూత్ లెవెల్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న, అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి

మోతీనగర్: ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే లబ్ధిదారులకు ఆరు గ్యారంటీలు ఇస్తామని మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అల్లాపూర్ డివిజన్ ఎస్‌డీ ఫంక్షన్‌హాల్‌లో అల్లాపూర్, మూసాపేట డివిజన్‌ల పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కార్యాచరణ, బూత్ లెవెల్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సునీతా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలన్నింటిని తూచా తప్పకుండా ఎన్నికల కోడ్ ముగియగానే అమలు చేస్తామని తెలిపారు. తాను గతంలో రెండు పర్యాయాలు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేసిన అనుభవంతో ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉందన్నారు. సమస్యలు పరిష్కరించే విధంగా తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. తనను పార్లమెంట్‌కు పంపితే మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.

- కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ మాట్లాడుతూ... ప్రతి ఒక్క కార్యకర్త బూత్‌లలో ప్రతి ఓటరును కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించి చేయి గుర్తుకు ఓటు వేసే విధంగా కృషి చేయాలన్నారు.
- కూకట్‌పల్లి పార్టీ కోఆర్డినేటర్ కోటిరెడ్డి వినయ్‌రెడ్డి మాట్లాడుతూ... కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

కార్యకర్తలు ఆగ్రహం...

- ఈ సమావేశంలో కొంతమంది కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో సీనియర్లని కాదని జూనియర్లకు పదవులు కట్టబెట్టడం ఏమిటని ప్రశ్నించారు. అదే విధంగా సమావేశాలకు సరైన సమాచారం ఇవ్వడం లేదని పలువురు కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పార్టీ పెద్దలు జోక్యం చేసుకొని సముదాయించి సభ యథావిధిగా జరిగే విధంగా చూశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ మోయిజ్, సత్యం శ్రీరంగం, తూము వేణు, గోపిశెట్టి రాఘవేందర్, శేరి సతీష్ రెడ్డి, దినేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి



కేపీహెచ్‌బీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో సునీతామహేందర్‌రెడ్డి

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం కాంగ్రెస్ బూత్‌స్థాయి కార్యకర్తలు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అమలు చేస్తామన్నారు. కార్యకర్తలు ప్రతి ఒక్క ఓటరును కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను వివరించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో తన విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.